వరద బాధితులకు చేయూత

సనత్‌నగర్: విజయవాడ రోడ్డులోని నందిగామ వద్ద వరదల తీవ్రతతో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్న అక్కడి ప్రజానీకానికి మోడల్‌కాలనీ మానవ సేవా సమితి అండగా నిలబడింది. వరద బాధితులకు నగరం నుంచి ఆహారంతో వాటర్ బాటిళ్లను పంపించారు. సమితి ప్రతినిధులు బుచ్చిబాబు నేతృత్వంలో ప్రత్యేక వాహనంలో వాటిని తరలించారు.

ఈఓ తీరుపై భక్తుల ఆగ్రహం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని కాశీ విశ్వనాథ స్వామి దేవాలయంలో దాదాపు గంటపాటు దర్శనాలను ఆలయ అధికారులు నిలిపివేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెజిమెంటల్‌బజార్‌లోని కాశీ విశ్వనాథ స్వామి దేవాలయ ప్రాంగణంలో సోమవారం క్షీరాభిషేకాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అజయ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆయన దర్శనానికి వస్తున్నారని తెలియడంతో సిబ్బంది భక్తులను ఆపేశారు. చైర్మన్ పూజలు చేసిన అనంతరం భక్తులను అనుమతించారు. ఈ విషయంపై ఈవో మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. అమావాస్య కావడంతో చైర్మన్ ప్రత్యేక పూజల కోసం వచ్చారన్నారు. అయితే భక్తులను ఎవరినీ ఆపలేదని పేర్కొన్నారు.

ఆహార ప్యాకెట్ల పంపిణీ



ఆహార ప్యాకెట్లను అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ

సనత్‌నగర్: భారీ వర్షాలకు ప్రభావితమైన సనత్‌నగర్ అల్లావుద్దీన్ కోఠి, దాసారం బస్తీల్లో టీపీసీసీ కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ పర్యటించారు. ఆయా ప్రాంతవాసులకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. వరద కారణంగా నష్టపోయిన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఈ సందర్భంగా వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కమల్‌రాజ్, రమేష్, ఐవన్‌వాజ్, అద్నా, అతిక్ మొహసిన్, ఎస్ఎస్‌రావు, ఎస్ఎస్‌రెడ్డి, కృష్ణ యాదవ్, రాజేశ్వరి, రజనీకాంత్ పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ పర్యటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజల అనంతరం మాట్లాడుతున్న రామకృష్ణ

కంటోన్మెంట్: భారతీయ సనాతన ధర్మం గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కంటోన్మెంట్ బోర్డు సభ్యులు జే. రామకృష్ణ అన్నారు. సోమవారం సోమవతి (పోలాల) అమావాస్య సందర్భంగా ఐదోవార్డు కాకగూడ హనుమాన్ ఆలయం, ఆరోవార్డు కట్టమైసమ్మ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మన సనాతన హిందూ ధర్మం ఎంతో గొప్పదని, మన ఆలయాలు నిత్యం కొన్ని లక్షల మంది కడుపు నింపుతుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, శ్రీనివాస్, భిక్షపతి, శంకర్, ఆలయ పూజారులు, ఉపేందర్, మహేష్ , శ్రీనివాస్, బాలకృష్ణ, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి వేడుకలకు చురుగ్గా ఏర్పాట్లు



పద్మారావునగర్‌లో ముస్తాబవుతున్న గణేష్ మండపం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో గణేష్ వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 7న ప్రారంభమయ్యే నవరాత్రోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. బస్తీలు, కాలనీలు, అపార్టుమెంట్స్, పలు ప్రధాన రహదారుల్లో భారీ గణనాథుల ఏర్పాటుకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఇప్పటికే మండపాల ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఓల్డ్‌బోయిగూడ, టకారబస్తీ, అశోక్‌నగర్, బండిమేట్, రాణిగంజ్, బోయిగూడ, పద్మారావునగర్, సీసీ నగర్, దేవీనగర్, ఐడిహెచ్ కాలనీ, బోలక్‌పూర్ తదితర ప్రాంతాల్లో గణేష్ ఉత్సవాల కోసం ఇప్పటికే మండపాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే మండపాలకు వినాయక ప్రతిమలను తీసుకువచ్చారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో .. టమాటా కిలో రూ.21, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 75, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 26, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 50, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 65, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 13, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 44, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 50, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అండగా ఉన్నాం.. ఉంటాం..



వివిధ విభాగాల అధికారులతో వరదపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

వరదనీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- అధికారులు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే పద్మారావు సమీక్ష

సికింద్రాబాద్ : నిరాటంకంగా కురుస్తున్న వర్షాలకు సికింద్రాబాద్ నియోజకవర్గం ప్రజలు ఎటువంటి ఆదోళనకు గురికావాల్సిన అవసరం లేదనా సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ భరోసా ఇచ్చారు. వరదనీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సోమవారం కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మితో కలిసి జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, వైద్య, పోలీసు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్కర సందర్భాల్లో ప్రజలకు అండగా నిలుస్తామని చెప్పారు.

- నాలాలకు రూ.6.50 కోట్ల వ్యయంతో నాలాలకు కల్వర్టులు, అవుట్‌లెట్ల నిర్మాణాలు చేపట్టి నియోజకవర్గంలో ముంపు సమస్యకు పరిష్కారం చూపామన్నారు.
- సీతాఫలమండి లోని తమ కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, విపత్కర సందర్భాల్లో ప్రజలను ఆదుకోనేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నామని ఎమ్మెల్యే చెప్పారు. అత్యవసర సందర్భాల్లో వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాస శిబిరాలను సొంత ఖర్చుతో ఏర్పా టు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు.
- వినాయక నవరాత్రుల సందర్భంగా రహదారుల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు.. విద్యుత్ విభాగం ద్వారా సమస్యల పరిష్కారంలో జాప్యం పై ఫిర్యాదు చేశారు. అదే విధంగా చెట్లు కూలిన వెంటనే అధికారుల స్పందన లోపించిందని ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఆయా విభాగాల ఉన్నతాధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి జాప్యం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- భారీ వర్షాల నేపథ్యంలో నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పద్మారావు గౌడ్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నాలాల పరీవాహక ప్రాంతాలు, నాలాలను ఆవరించి ఉన్న బస్తీల్లో పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో నేల కూలిన చెట్లను తొలగించే పనులను పరిశీలించారు.
- జీహెచ్ఎంసీ ఈఈ ఆశాలత, డీఈలు వెంకటేశ్వర్, స్వర్ణ లత, శ్రీనివాస్, ఎంఆర్ఓ భూపతి గౌడ్, ఎస్.ఐ. గంగాధర్, విద్యాధికారి డాక్టర్ సక్కుబాయి, బీఆర్ఎస్ నాయకులు తీగుల్ల రామేశ్వర్ గౌడ్, రాజ సుందర్, కంది నారాయణ, లింగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.



శ్రీనివాస్‌నగర్‌లో నాలా ప్రవాహాల తీరును పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

మహానేతకు ఘన నివాళి



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగులూరి సాయిబాబా తదితరులు

చిలకలగూడ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి వేడుకలను సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా నేతృత్వంలో చిలకలగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సాఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ అందించిన సేవలను కొనియాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా మనమధ్య లేకున్నా ఆయన అందించిన ఫీ రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ తదితర పథకాలతో తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగులూరి సాయిబాబా అన్నారు. కార్యక్రమంలో నాయకులు జలంధర్‌రెడ్డి, సతీష్, ప్రమోద్, అంజి, దేవుడువెంకట్, శంకర్, శ్యామ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: మరో రెండు రోజులు కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎక్కడా నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని, మ్యాన్‌హోల్స్‌ను మూసి ఉంచేవిధంగా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. నాలాలకు కూడా ఎగువ నుంచి నీటి వరద ఉధృతంగా వస్తున్నందున నాలా పరిసర కాలనీల పట్ల ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా చెట్ల కొమ్మలు విరిగిపోయి రాకపోకలు నిలిచిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం తదితర అత్యవసర సేవల కోసం జీహెచ్ఎంసీలోని 040-21111111కు కాల్ చేయాలని సూచించారు.

శిథిలావస్థలో యూపీహెచ్‌సీ భవనం



యూపీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సక్కుబాయి, కార్పొరేటర్ హేమ

చిలకలగూడ : శిథిలావస్థకు చేరిన చిలకలగూడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) భవనం కూలేందుకు సిద్ధంగా ఉందని స్థానికులు, హెల్త్ సెంటర్ సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సక్కుబాయి, డాక్టర్ లాస్యలతో కలిసి సోమవారం ప్రైడేమార్కెట్ సమీపంలోని యుపీహెచ్‌సీ భవనాన్ని సందర్శించారు. చిలకలగూడ యుపీహెచ్‌సీని మహ్మద్‌గూడలోని రెడ్‌క్రాస్ ఆస్పత్రి భవనం మొదటి అంతస్థులోకి మార్చాలని కోరగా, వైద్య అధికారులు సానుకూలంగా స్పందించారు. యుపీహెచ్‌సీ భవన మరమ్మత్తులకు నిధులు కేటాయిస్తామని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన..

నామాలగుండు నుంచి చిలకలగూడ వెళ్లే మైలార్‌గడ్డ సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ హేమ, జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్‌లు సోమవారం పరిశీలించారు.

క్రైం కార్నర్..

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం



ప్రియదర్శిని



దాన్యకుమార్

అడ్డగుట్ట: లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. వినోభానగర్‌కు చెందిన విద్యార్థిని, ఇందిరా నగర్‌కు చెందిన వ్యక్తి అదృశ్యమయ్యారు.

- కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. లాలాగూడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి తెలిపిన మేరకు.. లాలాపేటలోని వినోభానగర్ కమ్యూనిటీహాలు సమీప ప్రాంతానికి చెందిన ప్రియదర్శిని(19) విద్యా నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బికామ్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. గతనెల ఆగస్టు 29న కాలేజీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన ప్రియదర్శిని రాత్రైనా ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. పరిసర ప్రాంతాల్లో వెతికినా, స్నేహితులను వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి లావణ్య లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.
- నార్త్‌లాలాగూడలోని ఇందిరా నగర్‌కు చెందిన దాన్యకుమార్(57)కు మానసికస్థితి సరిగాలేదు. అతని సోదరుడి ఇంట్లోనే నివాసముంటున్నాడు. గత నెల ఆగస్టు 30న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన దాన్యకుమార్ మళ్లీ ఇంటికి రాలేదు. దీంతో సోదరుడు శోభన్ బాబు సోమవారం లాలాగూడ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



లాలాపేట: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన ఉస్మానియాయూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. తార్నాక మెట్రో స్టేషన్ వద్ద ఫుట్‌పాత్‌పై దాదాపు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఓ వ్యక్తి పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఓయూ కాని స్టేబుళ్లు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా ఆ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రసూల్‌పురా: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన కార్ఖాన పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆదివారం అర్ధరాత్రి పీఎస్ పరిధిలోని ఎస్‌బీఐ సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో ఉన్నాడని పెట్రోలింగ్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు 100 డయల్ ఫోన్ ద్వారా సమాచారం అందింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి బాధితుడిని గాంధీ ఆసుపత్రికి అంబులెన్స్‌లో చికిత్స కోసం తరలించారు. తీవ్ర గాయలతో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ నరేష్ నేతృత్వం లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.20కే వైద్య సేవలు అభినందనీయం



అల్ట్రా సోనో గ్రఫి సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

రసూల్‌పురా: కేవలం 20 రూపాయలకే పేదలకు కేఎస్ఎస్ చారిటబుల్ హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందజేయడం అభినందనీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. సోమవారం రసూల్‌పురా ఇంద్రమ్మనగర్‌లో కేఎస్ఎస్ చారిటబుల్ హెల్త్ కేర్ సెంటర్‌లో డిఐజీ సునీత, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎస్ ఏ హుడాతో కలసి శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఈసీజీ, 2 డీ ఎకో, అల్ట్రా సోనోగ్రఫీ సెంటర్‌ను ప్రారంభించారు. నగరంలోనే అతి పెద్ద మురికివాడ ప్రాంతంగా పేరొందిన రసూల్‌పురా ప్రాంతంలోని పేదలకు క్రియా సంఘ్ సొసైటి (కేఎస్ఎస్) కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. డీఐజీ సునీత మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితిల్లో సైతం క్రియాసంఘ్ సొసైటి తరపున షేక్ నయీం వేలాది మందికి మందులు, శానిటైజర్లు, మందులు భోజనాలు పంపిణీజేశారని అన్నారు. కేఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి షేక్ నయీం తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రావుకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రంగస్థల నటులు జగన్‌మోహన్‌రావు

సనత్‌నగర్: రంగస్థల నటులు, కళాసేవలో 49 వసంతాలు పూర్తిచేసుకున్న శ్రీరామకృష్ణా నాట్య మండలి అధినేత జొన్నలగడ్డ జగన్‌మోహన్‌రావుకు చెన్నై గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు ఆయన ఇటీవల జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ పత్రాన్ని అందుకున్నారు. 1972లో అభిమన్యుడు పాత్రతో ఆయన నట జీవితం మొదలైంది. 1975లో రామకృష్ణ నాట్య మండలి, సాంస్కృతిక సేవా సంస్థని స్థాపించి ఎంతో మంది కళాకారులను తీర్చిదిద్దుతూ వస్తున్నారు. ఆయన నట ప్రస్థానంలో 2,400 పైగా నాటకాలు ప్రదర్శించారు. 800 మందికి పైగా కళాకారులను సత్కరించిన ఘనతను రామకృష్ణ నాట్యమండ సొంతం. ప్రభుత్వ, వివిధ సాహిత్య, సాంస్కృతిక సంస్థల నుంచి 150కు పైగా అవార్డులు, పురస్కారాలను అందుకున్నారు. నాలుగు తరాల నుంచి కళా సేవా చేస్తూ నాటక రంగాన్ని, తెలుగు భాషను కాపాడుతున్న జగన్‌మోహన్‌రావుకు డాక్టరేట్ దక్కడం పట్ల నాటక రంగ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

బీసీ నేతల అరెస్టు ప్రజాస్వామ్య విరుద్ధం



గాంధీలో సిద్దేశ్వర్‌ను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

గాంధీఆస్పత్రి : బీసీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజీ నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవీ రమణ, ఆశయ్యలు ప్రభుత్వాన్ని కోరారు. కులగణన, కామారెడ్డి బీసీ డిక్లరేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ గాంధీ ఆస్పత్రిలో కొనసాగిస్తున్న ఆమరణదీక్ష 9వ రోజులకు చేరింది. సోమవారం సీపీఎం నాయకులు సిద్దేశ్వర్ పరామర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు న్యాయమైన డిమాండ్ల సాధనకు శాంతియుతంగా దీక్ష చేపట్టిన బీసీ నాయకులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. గాంధీఆస్పత్రిలో దీక్ష కొనసాగిస్తున్న బత్తుల సిద్దేశ్వర్‌ను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావులు పరామర్శించి మద్దతు ప్రకటించారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో బీసీ నేత జక్కుల సంజయ్‌కుమార్‌ను సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, జూలూరి గౌరీశంకర్‌లు పరామర్శించారు.

క్రెడిట్ కోఆపరేటివ్ సభ్యులకు వరద సహాయం




సాల్మన్‌రాజు కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న సొసైటీ డైరెక్టర్లు

సికింద్రాబాద్: అకాల వర్షాలతో వరద ముంపునకు గురైన ప్రాంతాలలో నివాసం ఉండే దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు ఆర్థిక చేయుత అందించాలని సొసైటీ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. సోమవారం జరిగిన క్రెడిట్ సొసైటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి తెలిపారు. వరద సహాయక చర్యల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.30 వేలు అందిస్తామని తెలి పారు. విజయవాడ, రాయనపాడు, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ ప్రాంతాలలోని 12 వేల మంది రైల్వే క్రెడిట్ సొసైటీ సభ్యులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. సమావేశం అనంతరం ఇటీవల మృతి చెందిన రైల్వే క్రెడిట్ సొసైటీ సభ్యుడు సాల్మన్‌రాజుకు చెందిన రూ.8.53 లక్షల రుణాన్ని మాఫీ చేస్తూ తీర్మాణం చేశారు. సాల్మన్‌రాజు కుటుంబ సభ్యులకు సొసైటీ వాటాధనం రూ. 4.31 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు ఆర్.రామ్మోహన్, రవిశంకర్, విజయలక్ష్మి, చక్రధర్, అశోక్ పాల్గొన్నారు.

పాతిన వాళ్లే దోచేశారు!

- అండర్ గ్రౌండ్ కేబుల్స్ చోరీ ముఠా అరెస్టు
- రూ.10 లక్షల విలువైన కాపర్ కేబుల్స్ స్వాధీనం



కాపర్ కేబుల్స్ చోరీకి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీ దృశ్యం

కంటోన్మెంట్: కేబుల్ వైర్ల చోరీలకు పాల్పడుతున్న ముఠాను బోయిన్‌పల్లి పోలీసులు పట్టుకుని, వారి నుంచి రూ.10 లక్షలు విలువైన కాపర్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయా కేబుల్స్‌ను భూమిలో పాతే పని చేసే కార్మికులే ఈ చోరీకి పాల్పడటం గమనార్హం. నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాల్ సోమవారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. తమ సంస్థకు సంబంధించిన భూగర్భ కాపర్ వైర్ చోరీ గురైనట్లు బీఎస్ఎన్ఎల్ సీనియర్ ఉద్యోగి డి. మూర్తి, గత నెల 13న బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు విచారణలో భాగంగా పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా సెంటర్ పాయింట్ సమీపంలో కొందరు వ్యక్తులు అండర్ గ్రౌండ్ కేబుల్స్ తొలగించి, ఆటోలో తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాల నెంబర్ల ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చోరీలకు పాల్పడినట్లు గుర్తించిన 17 మంది, ఇద్దరు కొనుగోలు దారులపై కేసులు నమోదు చేశారు. 14 మంది నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10 లక్షలు విలువైన 120 కేజీల కాపర్ కేబుల్, పాసింజర్ ఆటో, రెండు బైక్‌లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం, మహబూబాద్, సూర్యాపేట జిల్లాలకు చెందిన వీరు హయత్ నగర్‌లోని బంజారా కాలనీలో నివాసముంటున్నారు. నిందితుల్లో కొందరు ఆయా కేబుల్స్ అండర్ గ్రౌండ్‌లో పాతే పనుల్లో పాల్గొన్న కార్మికులుగా గుర్తించారు. వారిపై బోయిన్‌పల్లితో పాటు కార్ఖానా, కుషాయిగూడ, అబ్దుల్లాపూర్ మెట్ పోలీసు స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు డీసీపీ తెలిపారు.